# నరకంలో నించి....

రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది.

రోడ్లమీద కరెంటు దీపాలు వెలుగుతున్నాయి. సాయం కాలం నుంచీ సన్నగా పడుతూన్న వర్షం కాస్త తగ్గింది. శివరావుగారి అద్దెగదిలో కిరోసిన్ దీపం బుడ్డి వెలుగు కిటికీలోంచి బయటపడుతోంది.

శంకరం వచ్చి తలుపు మెల్లగాతోశాడు. ఎదురుగా నులక మంచం మీద తండ్రి పడుకోని ఉండటం చూశాడు. లోపలికి వచ్చి చప్పుడు కాకుండా చెప్పులు వదిలాడు. బట్టలు మార్చుకొంటూ వంటసామానుండే వేపు చూశాడు. అక్కడ రెండు చదరలు పర్చి ఉన్నాయి. రెండు కంచాలూ నీళ్ళ గ్లాసులూ అన్నంగిన్నె వగయిరా అన్నీ సిద్ధంగా పెట్టి వున్నాయి.

"పిచ్చి నాన్న నా కోసం ఎదురుచూసి అలాగే నిద్రపోయినట్లున్నాడు" అనుకొంటూ నీళ్ళు తీసుకుని కాళ్ళూ చేతులూ కడుక్కొనొచ్చి రెండు కంచాలలోనూ అన్నం వడ్డించి 'కూర ఏం ఉంది' అనుకుని మరో గిన్నె మూత తీశాడు. అందులో కూరలేదుకాని గోంగూర పులుసు వుంది. దాన్ని చూడగానే శంకరం నోరు వూరించి. అది రెండు కంచాలలోనూ వడ్డించి లేచి తండ్రి దగ్గరగా వచ్చిపిలిచాడు.

"నాన్నా! నాన్నా!"

కొడుకు పిలుపు వింటూనే శివరావుగారు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"వచ్చావా నాయనా! ఇంత ఆలస్యం అయిందేం? కాళ్ళు కడుక్కో-వడ్డిస్తాను అంటూ లేచాడు.

"కాళ్ళూ కడుకున్నాను, అన్నమూ వడ్డించాను, రండి భోజనం చేద్దాం"

ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. గోంగూర పులుసు కలుపుకుని నేతిగిన్నె కోసం చూశాడు శంకరం. అది గ్రహించి కాస్త బాధగా అన్నాడు శివరావు "నెయ్యి అయిపోయింది నాయనా!"

"పోనివ్వండి ఏం ఫర్లేదుగాని పులుసు చాలా బాగుంది కదూ! గోంగూర ఎప్పుడు తెచ్చారు నాన్నా?"

"ఇది నేను చెయ్యలేదురా! ఎదురింప సరస్వతి అత్త పంపింది. వాళ్ళదీ అంతంత మాత్రం సంసారమే అయినా ఇలా పంపవద్దు అని నేను చెప్పినా సరస్వతి వినదు తల్లిలేని పిల్లాడు శంకరం. మీరు ఏదో వుడకేసి పెడతారే అనుకోండి. ఆ వంట ఏం రుచి వుంటుంది? ఈ కాస్త మీ కిస్తే మాకు లోటురాదులెండి అని చెప్పి మరీ ఇచ్చి పోయింది" శివరావు కబుర్లు చెప్పసాగాడు.

శంకరం ముఖంలోని ప్రశాంతత యెగిరి పోయింది. తండ్రి ముఖంలోకి ఓసారి విసుగ్గా చూశాడు. ఆయన మాత్రం కొడుకువైపు చూడటంలేదు. కొడుకు చాలు! అనేవరకూ వడ్డించుకుని మజ్జిగా పోసుకున్నాడు.

"నాన్న మనకిలాంటి పోరట్లు అలవాటు లేదెప్పుడూ. యిప్పుడు మాత్రం యెందుకు తీసుకోవాలి. తీసుకున్నామే అనుకో! మళ్ళీ మనం యేమిచ్చి చెల్లువేయాలి! కనుక...."

"శంకరం సరస్వతిది చాలా జాలిగుండె నాయనా! కనుక నేను తిరస్కరిస్తే బాధపడుతుందనీ.... పుచ్చుకోంటాను."

"బాగుంది. ఆమెని చూస్తే మీకు జాలి. మిమ్మల్ని చూస్తే ఆమెకు జాలి."

శివరావుగారు ఈ మాటవిని తలెత్తి కొడుకు ముఖంలోకి చూశారు. ఈ విషయం యింక పొడిగించకూడదు అనుకున్నాడు.

"నువ్వు వెళ్ళు నాయనా, నే తీస్తాను కంచాలు."

"నే తీస్తాను, మీరే లేవండి."

"ఒద్దులే బాబూ."

"చిన్నప్పుడంతా చేశారు. యింకా చేయించనా మీచేత?"

"అమ్మవుంటే చేయదూ!" శివరావు కొడుకువైపు ప్రేమగా చూస్తూ అతని చేతిలోని పళ్ళాలు లాక్కొని అక్కడ అంతా సర్దివచ్చి మంచంమీద కూర్చున్నాడు.

"శంకరం నువ్వు వచ్చేసరికి నేను పడుకున్నానా! ఆ నిద్రలో ఓ మాంచి తియ్యని కలగన్నానురా!"

"ఏమిటి నాన్నా అదీ?"

'సరిగ్గా విను. నీ చదువు అయిందట. ఓ పెద్ద ఆఫీసర్ వుద్యోగం నీ కొచ్చిందట. చక్కని అమ్మాయిని చూసి పెళ్ళి చేసేశానట. ఆ పిల్ల అస్తమానం నన్ను అతి ఆత్మీయంగా చూస్తూ వుంటూ వుందట. నీకో బాబు పుట్టాడట. ఆ బాబు అచ్చంగా మీ అమ్మ పోలికలో వున్నాడట. ఆ బాబుని తోపుడు బండిలో కూర్చోబెట్టి తోసుకుంటూ అలా పార్కులోకి షికారుగా తీసుకు వెడుతుంటే దారిలో వెళ్ళే ప్రతిఒక్కరూ బాబుని చూసి పలకరించి ముద్దుల వర్షం కురిపిస్తున్నారట! శంకరం ఈ కల బాలేదు!"

"చాలా బాగుంది నాన్నా! నాకు యేడాది అప్పుడు అమ్మపోయినా మీరు మీ సుఖం విషయం పక్కకినెట్టి నన్నే మీ ప్రపంచంగా చేసుకున్నారు. నేను పెద్దవాడిని అవుతూ అవుతూన్నాననుకోండి. యింక నాకు పుట్టబోయే పిల్లల కోసం కలలు కంటున్నారా అప్పుడే" అంటూ

పెద్దగా నవ్వేసి తర్వాత "యింక నిద్రపోండి నాన్నా" తను పడుకుంటూ అన్నాడు.

'ఆ కలే కంటిన్యూ కావాలి' అనుకుంటూ మంచంమీద వాలి కళ్ళు మూసుకున్నాడు శివరావు. నిద్రవస్తూవస్తూ వుంది. ఆయన రావాలనుకునే తియ్యటి కల రాలేదుగానీ యెక్కడినించో యేడుపు విన్పిస్తోంది. కళ్ళు తెరిచి ఆలకించసాగాడు.

ఆ గొంతు సరస్వతిది. ఆమె భర్త రోజులానే ఫుల్లుగా తాగి వచ్చి బూతులు తిడుతూ మధ్య మధ్య భార్యని చావగొడుతున్నాడు. ఆమె విలపిస్తోంది. యిది ఆ వాడలో వున్న అందరికీ అలవాటే కావటంవల్ల యెవరూ పట్టించుకోవటంలేదు. శివరావు చప్పునలేచి కూర్చున్నాడు. విసురుగా వెళ్ళి తలుపు తెరిచాడు. ఓక్షణం ఆలోచించాడు అంతే వెనక్కి తిరిగి వచ్చి మంచంమీద కూర్చున్నాడు.

ఆయనకి నిద్రరావటంలేదు సరస్వతి యేడుపు ఆగిపోయింది. శంకరం నిద్రతీసి కళ్ళుతెరచి తండ్రి మంచం వైపు చూశాడు.

'నిద్రపో నాన్నా' అంటూ దుప్పటి నిండుగా కప్పుకుని పడుకున్నాడు.

ఓ ఫాక్టరీలో చిన్న వుద్యోగం శివరావుకి. వచ్చే కొద్ది జీతంతోనే భార్య శాంతతో హాయిగా ఆనందంగా కాలం వెళ్ళదీస్తుండగా శంకరం పుట్టాడు. శంకరానికి యేడాది నిండకుండానే శాంత నాలుగు రోజులు జ్వరం వచ్చి కళ్ళుమూసింది శివరావుకి వచ్చిన ఈ కష్టానికి స్నేహితులూ బంధువులూ చాలా విచారించారు. తర్వాత ఓ సలహా కూడా యిచ్చారు.

పాతికేళ్ళు నిండిన నువ్వు ఈ ఒంటరి జీవితం యెన్నాళ్ళని భరించగలవు. ఈ పసికూనని యెలా పెంచి పెద్ద చెయ్యగలవు. కనుక రెండో పెళ్ళి చేసుకో' అని.

శివరావు ఈ సలహాని పాటించలేదు.

"నా బాబే నాకు ప్రాణం. వీడిని పెంచి పెద్దచేయటమే నాధ్యేయం"

అని ఆ నాటి నుంచీ ఈ నాటి వరకూ అదేమాట మీద వున్నాడు. కొడుకుని కంటికి రెప్పలా పెంచి పెద్దచేశాడు. తన శక్తినంతా ధారపోస్తూ యం'యస్సీలో చేర్పించాడు.

ఇరుగూ పొరుగూ శివరావుని చూసి ఇకిలిస్తూ వుంటారు. సకిలిస్తూంటారు. "తనలా గుమస్తాగాకాక ఆఫీసర్ని చేస్తాడట. అదెంతవరకూ సాగుతుందో చూద్దాం! ఈ పిచ్చిమాలోకం పీనాసిలా తను బ్రతుకుతూ పైసపైసా దాచి కొడుకుని కొండెక్కించాలని ఆరాటపడుతూన్నాడు. కానీ ఆయన కల నిజం అవదని తెలియదు. ఈ యెధవ కాలంలో గుమస్తా కొడుకు గుమస్తాయే కావాలి, మినిష్టరు కొడుకు మినిష్టరే కావాలని రూలెట్టుతూ వున్నారు. ఇదే జరుగుతూ వుందిమరి" అని గుసగుసలు పోతున్నారు, ఇవన్నీ విన్నా శివరావు జవాబు చెప్పడు. ఆయన ప్రయత్నం ఆయనదే. తిండికీ బట్టకీ కరువు వాచకూడదు కొడుకు. తన బ్రతుకులా సాగకూడదు కొడుకు బ్రతుకు. ఇంతే ఆయన ధ్యేయం.

శంకరం హైస్కూలు చదువు అయేవరకూ తండ్రి అంటే భయం భక్తి వుండేవి. తండ్రి మాట అంటే వేదవాక్కులా శిరసావహించేవాడు.

కానీ యిప్పుడిప్పుడు అతని ఆలోచనా విధానం మారిపోసాగింది. ఒకే సమస్య యిద్దరికీ భిన్నంగా కన్పించసాగింది. తండ్రి మనస్సుకి కష్టం కల్గిస్తుందని తెల్సినా తన భావాన్ని బైట పెట్టటానికి వెనకాడటంలేదు శంకరం. యీ మార్పు గ్రహించటంలేదు శివరావు. యిలా రోజులు సాగిపోతున్నాయి. శంకరం చదువు అయిపోయింది.

## 2

శంకరానికి లెక్చరర్ వుద్యోగం వచ్చింది. ఒక నెల రోజులు కూడా జరగలేదు. ఓ రోజు శంకరం కాలేజీ నుంచి ఇంటికి వచ్చాడు. తన ఇంటి ముందు చాలా మంది గుంపుగా కన్పించారు. వాళ్ళంతా యిరుగు పొరుగు వారే. అందరూ తలోలా అంటున్నారు.

"ఈ నాటకం చాలా రోజులుగా సాగుతూనే వుంది."

"మనమే నిప్పులాంటి వాడు శివయ్య అనుకున్నాం"

"తాగుబోతు మొగుడొద్దు అనే సరస్వతికీ, పెళ్ళాంలేని ఈయనకీ సరిపోయిందిగా. అందుకే అంత ధైర్యంగా మనందరి ముందునించే చెయ్యి పట్టుకుని తేవదీసుకుని వెళ్ళాడు."

"ఎక్కడికీ అంటే చెప్పాడా!"

"మొగుడు తాగొచ్చి తంతే మాత్రం ఆడది అట్టా యెళ్ళిపోవటమేనా! కాపరం ఒదులుకొని. అందరు తాగుబోతుల పెళ్ళాలూ దీనిలా లేచిపోతున్నారా?"

"ఆ తాగుబోతుగాడు ఆ ఇద్దరినీ బూతులు తిట్టీ తిట్టీ నిషా తగ్గింది కాబోలు మళ్ళీ తాగిరావటానికి వెళ్ళాడు."

"ఒలేయ్ ఇవ్వాళ సరస్వతి తిన్న దెబ్బలు చూస్తే నేనే సహించలేక పోయాను. తెలిసీ తెలియకా యేవేవో కల్లబొల్లి కబుర్లు చెప్పకో కూడదు" అంది ఓ ముసలమ్మ. మిగతా పాతిక మందీ ఆమె మీద విరుచుకు పడ్డారు.

"నీకేం తెల్సునే గుడ్డిదానా" అంటూ ఇలా అనుకుంటూనే శంకరాన్ని చూశారు. చూసి మరీ గుసగుసలు బోయారు. మాకేం అంటూనే జరిగింది చెప్పారు "రోజులానే సరస్వతి మొగుడు తాగి వచ్చాడు. ఒచ్చింతర్వాత ఇద్దరూ ఘర్షణ పడ్డారు. అంతే భార్యని చావబాదాడు. అది రోజూ కంటే కూడా యెక్కువగా యేడుస్తూండగా మీ నాయన ఇంట్లో నుంచి వచ్చాడు. ఒక్క మాట కూడా మాట్లాడలేదు యేడుస్తున్న సరస్వతికి చెయ్యి ఆసరా యిచ్చి నడిపిచ్చుకుంటూ పోతుంటే దాని మొగుడు అడ్డం వెళ్ళాడు. "నా పెళ్ళాం నా యిష్టం కొడతాను తిడతాను చంపుతాను నువ్వెవరు మధ్యన" అంటూ అరుస్తున్న అతన్ని విసురుగా తోసి సరస్వతిని తీసుకు వెళ్ళిపోయాడు."

శంకరానికి ఇదంతా అవమానంగా తోచసాగింది. కోపంతో ముఖం ఎర్రబడి పోయింది. విసురుగా ఇంట్లోకి వెళ్ళి తలుపులు ధాంమ్మని వేసేసుకున్నాడు. అందరూ అన్న మాటలూ గుసగుసలూ చెవుల్లో హోరు పెడుతున్నాయి. ఆవేశంతో వూగిపోతున్నాడు. తండ్రికి సంబంధించిన ప్రతి వస్తువునీ విసిరి నేలకేసి కొట్టాడు. అయినా కోపం తగ్గలేదు.

ఇంతలో వాకిలి తలుపు తట్టినశబ్దం విన్పించింది. విసురుగా వచ్చి తలుపు తెరిచాడు. యెదురుగా తండ్రి లోపలికి రాబోతున్నాడు.

శంకరం తండ్రివంక అసహ్యంగా చూచి బలంగా చాచి లెంపకాయ కొట్టాడు. శివరావు స్థాణువే అయాడు. కొడుకు కొట్టిన దెబ్బకి తూలిపడి బోయి నిలదొక్కుకుని కొడుకు ముఖంలోకి తదేకంగా చూడసాగాడు. తను ప్రాణంగా చూసుకునే కొడుకు తనపై చేయి చేసుకున్నాడా! చేసుకున్నాడు! యెందుకు! క్షణం ఆలోచించాడు, అర్థమైపోయింది. అంతే, వెనక్కి తిరిగి ఆ చీకటిలోకి నడిచాడు. అంతే ఆయన తిరిగి రాలేదు.

తెల్లవారింది.

శివరావుకి యేకైక స్నేహితుడైన ప్రసాదరావు పొద్దునే వచ్చాడు, తెరచి వున్న తలుపుచూసి "శివరావూ లేచావుటోయ్! నిన్న నువ్వు అప్పగించిన బాధ్యతని నెరవేర్చాను సరస్వతిని అనాధ శరణాలయంలో చేర్పించాను ఆమె బ్రతికే వుపాయం యేదో వాళ్ళు నేర్పిస్తారు. సోదరి లాంటి సరస్వతిని గురించి యింక దిగులు నీకు వద్దు ఓ కప్పు కాఫీనీళ్ళు పోశావా నే పోతాను" అంటూ తన స్నేహితుడు కన్పించక గది అంతా కలయజూసి ఆకారాన్ని గమనించాడు. "శంకరం నాన్నేడిరా! యింత వుదయమే యెక్కడికి వెళ్ళాడురా! ఆదేమిటి నీ కళ్ళు అలా జ్యోతుల్లా వున్నాయేమిటిరా! అసలేం జరిగిందీ! ఆ తాగుబోతు వెధవ నిన్ను యేమన్నా అన్నాడా! అన్నా ఫర్లేదు. సరస్వతిని ఆ నరకంలోంచి తప్పించి మరో మంచిదారి చూపించే ప్రయత్నం చేసి బ్రతకమన్నాడు మీ నాన్న నిజం చెప్పాలంటే మీ నాన్న మనసు నవనీతంరా శంకరం. యెవరి బాధనీ సహించలేనిదతని మంచి మనసు"

ప్రసాదరావుగారూ మీరు చెప్పినదంతా నిజమేనా! సరస్వతి నాన్న.... నాన్న "శంకరం మాట పూర్తిచేయలేక పోయాడు.

"సరస్వతికి మీ నాన్న యెలా దారి చూపించాడో చెప్పానుగా" ఆయన అయోమయంగా చూడసాగాడు,

శంకరం తల గిర్రున తిరిగిపోసాగింది. తనని చిన్నప్పటినించీ అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేసిన తండ్రి గోరు ముద్దలు తిన్పించిన తండ్రి చదువుకి జీతాలు కట్టటానికి అష్టకష్టాలు పడిన తండ్రి కళ్ళలో మెదిలాడు. తను లోకుల మాటలు విని ఆవేశపడి ఆలోచనలేకుండా కొట్టిన దెబ్బకి అయన నిలవరించుకో లేకపోయి తన కళ్ళలోకి చూసిన ప్రేమనిండిన ఆ చూపు గుర్తు తెచ్చుకుంటూ 'నాన్నా' అంటూ బోరు మన్నాడు.